కథానిక

# కీర్తికాముకుడి కనీసపు కోర్కె

“బదరీనాథ్”

నాకు ప్రపంచం అన్నా, డబ్బన్నా, పదవన్నా అమితయిష్టం. నాకు అవంటే వున్నంత ప్రీతి ప్రపంచంలో మరి యే ఒక్కరికీన్నీ లేదని ఘంటాపథంగా చెప్పగలను.

నేను కీర్తికాముకుణ్ణి. ప్రపంచం నలుమూలలా నా పేరు జెర్రిపోతల్లే పాకిపోవాలనీ, ప్రతి మానవుడి నోటివెంటా నా పేరే వినబడాలనీ, ప్రతి గోడమీదా తాటికాయంతంత అక్షరాల్లో నా పేరు కనబడాలనీ, నా కోరిక. అంతేకాదు—ప్రతి దైనిక పత్రికలోనూ, నా పేరూ, నా చేతలూ, నా ఉపన్యాసాలు హెడ్ లైన్స్‌లో పడాలనీ-నా వాగ్స్రవంతుల్ని ప్రతి- అంటే పేరున్న, లేని - ప్రతి పత్రికా అందమైన బోర్డరు లోపల ముచటై, ముద్దులొలుకు అచ్చులో ప్రచురించాలనీ నా మనసు. ప్రపంచంలోవున్న ప్రతి పత్రికా యిలానే చేస్తే, అన్ని పత్రికలకీ నేను చందాదారుడిగా చేరడమే కాకుండా, నా బంధుమిత్ర పరివారాదుల్నిగూడా ఉచితంగా చందాదారుల్నిగా చేర్పించి ఎడ్వర్టైజ్‌మెంటులున్నూ బుక్ చేస్తాను. అంతేకాకుకడా, అలాచేసిన ప్రతి పత్రిక్కీ ఆ జన్మాంతం కృతజ్ఞుడిగా వుంటాను. (ఇది చాలా రహస్యం సుమండీ! ఈ ముక్క నోరు జారైనా మరోవాళ్లతో అనొద్దు.)

ఇంతా చేస్తే-ఇప్పుడు నాకో భయం పట్టుకుంది. ఏ పత్రికైనా నన్నుగురించి అలా వ్రాస్తుందో వ్రాయదోనని. లేకపోతే నేను యింటర్నేషనల్ లీడర్ నవడానికి యే మూల నుంచీగూడా స్కోప్ లేదు. అయితే-మరెల్లాగ? పోనీ నా మహదాశయాన్ని వివరిస్తే పత్రికలన్నీ ప్రచురిస్తాయేమో.

“ప్రపంచంలో శాంతీ, అభ్యుదయం, సౌభ్రాతృత్వం నేను వాంఛించేవి. నాలోని ప్రతి రక్తపు చుక్కా, నా చర్మంలోని ప్రతి అణువూ ప్రజాసేవకి అంకితం చేస్తాను. ఎప్పటికైనా ప్రజలు నన్ను గుర్తించి, నా పేరు తెలుసుకుని పేసాన్ చెయ్యమని నా కోరిక. నేనే ప్రజలు ప్రజలే నేనుగా ఐక్యమై పోవడమే నా మహత్తర ఆశయం.” కాని నా ఆశయం ప్రజల్లో పడ్డం యెల్లాగ? నేను యింటర్నేషనల్ లీడర్నవడం యెలాగ? ఇది సంభవమేనా? అన్న ప్రశ్న నా మెదణ్ణి 'ఛీ' కొక్కన్నప్పుడు, టార్చిలైట్ల లాంటి నా రెండుకళ్ళూ అమాంతం డిమ్మయిపోయి కొస్త చెమర్చక మానవు. కొస్త గుండె ధైర్యంగల పిండాన్ని గాబట్టి జేబురుమాలుతో కన్నీళ్ళు వత్తుకుని, నాకసలు గొప్పవాణ్ణయ్యే యోగం ఉందో లేదో అని కుడి అరచెయ్యి చూచుకున్నాను. గొడ్డలిలాంటి ధనరేఖ ఈ మూల నుంచి అ మూలకి పాకిపోయింది. “ధనమూలమిదం జగత్” అన్న దేకనక రైటయినట్లయితే నేనూ ఒకనాటికి గొప్పవాణ్ణయి తీరాలి. ఒకవేళ గొప్పవాణ్ణి కానే అనుకోండి. ఆ “ధనమూల మిదం జగ” త్తన్న దాన్ని చరిత్రలోంచి యెర్ర సిరాతో కొట్టిపారేస్తాను. ఇంత చేసినా ఒక్కటే సమస్య నన్ను పీక్కు తినేది - నేను గొప్పవాణ్ణవడం యెలాగ? ప్రపంచంలో ప్రతి పత్రికా నా పేరు ప్రకటించడం యెలాగ? అదే నాకొక దైనిక సమస్యై కూర్చుంది.

ఒకనాడు తీవ్రంగా ఆలోచిస్తూ కూర్చున్నాను. అమాంతం టార్చిలైట్లలాంటి నా కళ్లు రెండూ మిలమిలా ధగధగా మెరిసి పోయినై. బుర్ర పగిలిపోయేలాంటి ఆలోచన యేమూల నుంచి ప్రవేశించిందో కాని నా బుర్రలోకి చటుక్కున ప్రవేశించింది. అదేవిటీ అంటే - నేనెందుకు కవిగారి(డి) నవకూడదూఅని. అపుడు ప్రతి పత్రిక్కీ నా కథలూ, గేయాలూ, పద్యాలూ పంపిస్తే అన్నీ అచ్చవుతాయి.

వాటితోపాటు నా పేరూ అచ్చులో పడుతుంది. అద్భుతమైన నా కవితా చాతుర్యానికి సంపాదకులూ, ప్రజలూ కూడా బెంబేలెత్తి పోతారు. ఫారెన్ పీపుల్ గూడా నా రచనల్ని చదివి బుర్రలు తిరిగిపోయి వాళ్ళవాళ్ళ భాషల్లోకి నావన్నీ అనువదించుకుంటారు. అప్పుడు ప్రపంచంలోవున్న ప్రతి పత్రికా నా పేరు ప్రకటించడానికి వీలవుతుంది. నా కాదెబ్బతోటి ఒద్దంటూంటే-అబ్బే అల్లా కాదని యింటర్నేషనల్ ఫేమ్ వచ్చి పడిపోతుంది. నా ఆశయం సిద్ధిస్తుంది. నా కోరిక ఫలిస్తుంది.

“ఇదేమిటీ! అరె! ఇంకా అవుదామనుకుంటూండగానే కవినైపోతున్నానేవిటీ? నా రచనలుపడ్డ పత్రికని ప్రజలు క్యూలోనుంచుని మరీ కొనుక్కుంటున్నారు. ఏజంటు ఇహ “కాపీల్లేవు పొండ”ంటున్నాడు కూడాను. ఇదిగో నా గ్రంథం, నా ఉద్గ్రంథం, ప్రపంచం షష్ఠమ వేదమని ఉద్ఘోషించే నా మహా ప్రబంధాన్ని ప్రజలు తండోపతండాలుగా కొనుక్కుని పోతున్నారు. “ఫస్టెడిషన్ సెకండెడిషన్, థర్డ్... ఫోర్త్... ఫిఫ్త్... ఫిఫ్టీఫిఫ్త్... అన్ని ఎడిషన్లూ అయిపోయినై. ప్రజలు ఇంకా కాపీలు కావాలని పడి ఛస్తున్నారు. కాపీలు వెయ్యలేక పోతున్నామని పబ్లిషర్స్ ఘోరిస్తున్నారు.”

ఈలోపల నా మనోవేగానికి బ్రేకుపడింది. నేను కూర్చున్న చోటే కూర్చున్నాను. ఉన్న చోటే వున్నాను. నేననుకున్నది ఏ ఒక్కటీ నిజం కాలేదన్న నగ్నసత్యాన్ని తులుచుకున్న మరు క్షణంలో నా దుఃఖం పొంగి పొర్లిపోయింది. ఎప్పటి సమస్యే నా బుర్రలో దొర్లిపోతూంది. ఎల్లాగ? ఎల్లాగ? ఎల్లాగ?

ఇంతలో శ్రీ శ్రీ ఇచ్చిన ఒక అమూల్యమైన సలహా నా మెదడులోకి కొట్టుకొచ్చింది.

“నువ్వు ఆంధ్ర దేశంలో గొప్పవాడివవాలంటే, నా మాట విని వెంటనే చచ్చిపో!”

ఈ కిటుకు తెలుసుకున్న మరు క్షణంలో నా ఒళ్లు యావత్తు తటిల్లతలా మెరిసిపోయింది. జలదరించింది కూడాను. గిలకరించిన నా మెదణ్ణి సంబాళించి, తిరిగి ఈ కిటుకునిగూర్చి చర్చించడం మొదలుపెట్టాను. చచ్చిపోవడమంటే చచ్చిపోవచ్చును గానీ, అంత టైము లేకుండా వెంటనే చచ్చిపోవడమన్నది బహు కష్టతరమైన విషయం. దీంట్లో చాలా సాధకబాధకాలున్నై. చచ్చిపోబోయేముందు సవరించుకోవలసిన పనులున్నూ చాలావున్నై. పోనీ తీరా ఛస్తామనుకోండి, ఒకవేళ కీర్తి రాకపోతే-పోనీ, వచ్చిందే అనుకోండి, అది ఆంధ్ర దేశంలో మాత్రమే అయితే? మరి నా యింటర్నేషనల్ ఫేమ్ మాటేమిటి? నో యూస్. చచ్చి లాభంలేదు. అసలు చావడం అన్నది చాలా భయంకరమైన విషయంకూడాను. ఆలోచించగా, ఆలోచించగా చావడం అన్నది మహా ఘోరపాతక మనిన్నీ, చట్టపరంగా క్రైమ్మనిన్నీ, రుమల విషయంలో నా ప్రాణం నాకు ‘స్వీట్’ అనిన్నీ గ్రహించిన తర్వాత, ఆత్మహత్యోద్దేశాన్ని అమలు జరపకూడదనుకున్నాను. అంతేకాదు. ఏకగ్రీవంగా నిర్ణయించి పారేశాను గూడాను. కాబట్టి- ఇహ ఛస్తే చావను. చచ్చినా చావను. చావడం కంటే కవిగా బ్రతకడమే మేలని నాకు తోచింది. కలమూ, కాగితమూ తీసేను. వ్రాయడం గూడా ప్రారంభించాను. నేను రాసేవి శాంతిజీవుల క్రాంతిగీతం. ఇందులో ప్రధాన పాత్రలు శాంతిజీవుల జీవితం, నేనూ, నా మెదడూను. నా గేయం శాంతి మహాసభక్కూడా వెడుతుంది. కాగితంమీద పెట్టిన నా కలం అనేక వంకర్లు తిరగడం ప్రారంభించి యెంతో ప్రసవబాధపడి చివరికో గేయాన్ని ప్రసవించింది.

“జీవితమ్ము నిలుచున్నది
శిఖరాగ్రపు టంచులలో!
కాగితమ్ము పడుకున్నది
కలము పాళియంచులలో.
కలము మింగుతున్న సిరా
కాగితమ్ము పీల్చుతోంది.
హఠాత్తుగా ఒక్కసారి
ఎందుకో కలమాగిపోగ
కలం పిండు కవిగారిది
బుఱ్ఱ తక్కున నుంచోని
కవిగారికి యెదురు తిరిగి
ఈ విధంగ ప్రశ్నించెను.
“ఏ జీవుల జీవితమని

ప్రాశావది కవిగ్రామణి"
కవిగారికి యీ సమస్య
మెదడున ఘనీభవించెను."

ఇంతటితో నా కలం ఆగిపోయింది. సిరా లోకి పాళీ జారిపోయింది. చలికి సిరా గడ్డ కట్టుకుపోయింది. నా చేతులూ వణుకుతున్నై. ఇహ నా గేయం ముందుకు జరిగేదలా? ఇంతలో యేదో అంతర్వాణి గొడ్డుకేక పెట్టినట్లయింది.

మా యిద్దరికీ యీ విధంగా సంభాషణ కొంతదూరం నడిచింది.

నేను ప్రశ్నించాను. "నాకు అంతర్జాతీయ కీర్తి రావడమెలాగ?"

"సిరాని కరిగించి, పాళీతీసి కలానికిపెట్టి తిరిగి నీ గేయం పూర్తిచేసి శాంతి మహాసభకు పంపిస్తే—ఎట్ లీస్ట్ నీకు నోబుల్ ప్రైజ్ ఐనా వచ్చి తీరుతుంది" అని చెప్పి అంతర్వాణి మాయమైపోయింది. వెంటనే సిరాలోకి జారిన పాళీని యివతలికి తీయడానికి ఘోరసన్నాహాలు ప్రారంభించాను. సిరా బుడ్డి కుదిపి చూసేను. లోపల సిరా ఐసు ముక్కలా గడ్డ కట్టేసింది. ఆ లోపల పాళీ చిక్కడిపోయింది. నాకు అంతర్జాతీయ కీర్తి రావడం ఆలస్యమైపోతోంది. వెంటనే సిరాబుడ్డిని 'ఢన్' మని నేలకేసి కొట్టాను. నా కీర్తి చల్లారక, నా క్రోధజ్వాలల కాహుతైన సిరా బుడ్డి చిద్రుప చిద్రుపలైంది. పేలిపోయిన అగ్నిపర్వతంలోంచి లావా ప్రవహించినట్టు సిరా కరిగిపోయి ప్రవహించడం ప్రారంభించింది. పాళీ యే మూలకో పారిపోయింది.

ఇహ నా గేయం జరగడం యెల్లాగ?
నా కంతర్జాతీయకీర్తి రావడం యెలాగ?
నా కీర్తి దాహం చల్లారడ మెల్లాగ?
నా ఆశలు అవకాశంలోనే నిల్చిపోయి_

(నేను—కీర్తికాముకుడు).

# ఆకులు రాలే కాలం

"హితశ్రీ"

రాత్రి తొమ్మిదిన్నరకి తలుపు నెమ్మదిగా తోసుకుని లోపల ప్రవేశించాడు రామచంద్రరావు. గదంతా చీకటిగా ఉంది. ఎదురుగా ఉన్న మేడలోంచి విద్యుద్దీప కాంతి ఆవరణలోని బాదంచెట్టు ఆకుల తెరలు సాధ్యమైనంతవరకు తప్పించుకుని కిటికీగుండా ప్రసరిస్తూ, మంచంమీద నిద్రపోతున్న వసంత ప్రశాంత ముఖాన్ని పరిశీలిస్తోంది. ఆ కాస్త వెలుగులో, గదిలో వస్తువులు నీడల్లా కనబడుతున్నాయి. కాని రామచంద్రరావు నుంచున్న చోటునించి కదలలేదు. అతను తదేక దీక్షగా వసంత ముఖంవైపు చూస్తున్నాడు. ఆవరించిన చీకటిలో ఆ కాస్త వెలుగువైపూ అతను ఆలోచనా రహితంగా అలాగే చూస్తూ నిలబడ్డాడు. గాలికి కిటికీ రెక్క కొట్టుకుంది. వసంత ఉలిక్కిపడి లేచింది. తనకి తెలియకుండానే రామచంద్రరావు బరువుగా నిట్టూర్పు విడిచాడు. ఆ చప్పుడికి వసంత తలెత్తి తలుపువైపు చూసింది. అతను ముందుకి నడిచాడు.

"ఎంతసేపైంది వొచ్చి?"

"ఇప్పుడే."

వసంత లేచి లాంతరు వెలిగించింది. రామచంద్రరావు మంచంమీద కూలబడ్డాడు. ఆమె లోపలికి వెడుతుంటం చూసి అన్నాడతను.

"ఇప్పు డాకలి లేదులే."

"ఏం?" ఆశ్చర్యంగా అడిగిం దామె.

రామచంద్రరావు జవాబు చెప్పలేదు. జేబులోంచి కొన్ని నోట్లు తీసి ఆమెకిస్తూ అన్నాడు.

"అలమారులో పడెయ్యి."

వసంత నోట్లవైపు ఆశ్చర్యంగా చూసింది. ఇంకా పదో తారీకైనా రాకుండా ఇప్పుడీ డబ్బెక్కడిది? బహుశా అప్పు తెచ్చారేమో ననుకుని నోట్లను అందుకుంటూ అడిగింది మాటవరసగా.

"ఎక్కడిది?"

"జీతం."

సాశ్చర్యంగా చూసింది వసంత.

"ఇప్పుడేం జీతం?"